క్లుప్తంగా

స్టాల్ గరల్స్ హాస్టళ్లకు రక్షణ కల్పించాలి

నెహ్రూనగర్: నగరంపాలెంలోని స్టాల్ గరల్స్ హైస్కూలు కాంపౌండ్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్సీ, బీసీ హాస్టల్స్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలని గరల్స్ హైస్కూలు విద్యార్థినులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఎంపీఈ సుకన్యా రాణి మాట్లాడుతూ బొల్లెద్దు కిరణ్ అతని అనుచర వర్గం స్కూల్ కాంపౌండ్‌లో అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కాంపౌండ్‌లోకి రాత్రిపూట బయటి వ్యక్తులు వచ్చి మద్యం తాగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. కాంపౌండ్‌లో ఎటువంటి వ్యాపారాలు నిర్వహించరాదని తీర్పు ఇవ్వడంతో చుట్టూ గోడ నిర్మించినట్లు పేర్కొన్నారు. అయితే, 19వ తేదీ రాత్రి కొంత మంది వ్యక్తులు గోడను కూల్చివేశారని, దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాంపౌండ్‌లో వ్యాపారాలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఆమె కోరారు.

శేషేంద్ర శర్మ సాహితీ సృజన విశ్వజనీనం



కవి శేషేంద్ర శర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: కవిగా, విమర్శకుడిగా, నవలాకారుడిగా తెలుగు సాహిత్యానికి గుంటూరు శేషేంద్ర శర్మ పరచిన దారి విశ్వజనీనమైనదని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం శేషేంద్ర శర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రముఖ కవిగా, విమర్శకుడిగా, బహుభాషా కోవిదుడుగా, గొప్ప కవితా వారసత్వానికి శేషేంద్ర శర్మ గట్టి పునాదులు వేశారని తెలిపారు. ఆధునిక, సంప్రదాయ రీతుల్లో సరి సమానంగా అనేక రమైన మధురమైన కవితల్ని అందించారని గుర్తు చేశారు. ఆయన రచనల్లో ప్రధానంగా ప్రకృతి, సామాన్య ప్రజల స్థితిగతులు కళ్లకు కట్టినట్లు కన్పించేవని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సాహితీ రంగ విశ్లేషకులు బిళ్లా అశోక్, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోయేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పుష్పరాజ్‌కు నివాళులు



నెహ్రూనగర్: నీతి, నిజాయతీ కలిగిన రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి జె.ఆర్. పుష్పరాజ్ అని చార్వాక యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ పేర్కొన్నారు. పుష్పరాజ్ జయంతిని పురస్కరించుకుని లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి శుక్రవారం రాత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డేవిడ్ విలియమ్స్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడిచిన వ్యక్తి పుష్పరాజ్ అని కొనియాడారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మద్దు ప్రేమజ్యోతిబాబు, ప్రసాద్, బందెల డేవిడ్, మేళం సునీల్ ప్రకాష్, రాయపూడి మరియదాసు, నామతోటి శంకర్, సుముద్రాల కోటేశ్వరరావు, తెనాలి మనోహర్ పాల్గొన్నారు.

సత్యనారాయణకు పీహెచ్‌డీ



సత్యనారాయణకు పట్టా అందజేస్తున్న సునీల

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ ఆడిటర్ గొట్టిపాటి సత్యనారాయణ విద్యా విభాగంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రభుత్వ ఉద్యోగానికి ముందు సత్యనారాయణ గుంటూరులోని ఆర్వీఆర్ డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 'వృత్తిపరమైన నిబద్ధత, సర్వీసులో ఉన్న అధ్యాపకుల ఉద్యోగ ప్రమేయానికి సంబంధించి బోధనా సామర్థ్యాలు ' అనే శీర్షికతో ఆయన చేసిన థీసిస్ ను గుంటూరులోని ఏఎల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్తేర్ సునీల పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శుక్రవారం లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఎడ్ కళాశాలలో సునీల సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొని సత్యనారాయణను అభినందించారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



శిబిరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

పట్నంబజారు: పశ్చిమ నియోజకవర్గం 38, 42 డివిజన్ల పరిధిలో శుక్రవారం బృందావన్ గార్డెన్స్, శ్రీరామ్‌నగర్ సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ప్రారంభించారు. శిబిరానికి హాజరైన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. దీర్ఘకాలిక వ్యాధుల్ని సైతం పరిష్కరించే దిశగా అనుభవం ఉన్న వైద్యులతో ప్రజలకు చికిత్స అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని చెప్పారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తిస్థాయిలో అన్ని పరీక్షలు ఉచితంగా చేసి, మందులు, కళ్లజోళ్లు అందిస్తున్నారని చెప్పారు. శస్త్రచికిత్స అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బొగిసం ప్రసాద్, చల్లా శేషిరెడ్డి, నల్లబోతు సాంబశివరావు, శ్రీకాంత్‌కుమార్, వెంకటరెడ్డి, ఆంజనేయులు, లక్ష్మి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న మంత్రి అంబటి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, డొక్కా మాణిక్య వరప్రసాద్

పట్నంబజారు: అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణాజిల్లాల కో- ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌తో కలసి మంత్రి తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన దానసిరి శంకరరావుకు రూ. 1.20 లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ, రీజినల్ కో- ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ అనేక పథకాలు తీసుకొస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట

- నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు
- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మేయర్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. 12వ డివిజన్ చౌత్ర సెంటర్‌లోని గవర్నమెంట్ గరల్స్ హైస్కూలులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును అధికారులతో కలసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఇంటి వద్దకే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి హెల్త్ సెంటర్ వద్ద సురక్ష క్యాంప్‌లు జరుగుతున్నాయని, రాష్ట్ర చరిత్రలో ఎవ్వరూ ఊహించని విధంగా వీటిల్లో ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు స్పెషలిస్ట్ డాక్టర్లను అందుబాటులో ఉంచారని వివరించారు. క్యాంప్‌ల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు. క్యాంప్‌ల్లో ఖరీదైన కంటి పరీక్షలు, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు పూర్తి ఉచితంగా చేసి మందులు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, మెడికల్ ఆఫీసర్స్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగమంటే పవిత్రమైన బాధ్యత

- కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి
- 93 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఉద్యోగమంటే ఉపాధి మాత్రమే కాదని, అదొక పవిత్రమైన బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ స్వాతితో కలసి 93 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తూ మరణించిన వారికి ఇంత స్థాయిలో ఎన్నడూ నియామక పత్రాలు అందజేయలేదని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగంలో చేరుతున్న అభ్యర్థులు దాన్ని గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఉన్నామనే భావన ఉండాలని చెప్పారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు లక్షల మంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కారుణ్య నియామకం ద్వారా ఎంపికైన వారు తల్లిదండ్రుల శ్రమను గుర్తుంచుకోవాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలతోనూ, సహచర సిబ్బందితోనూ స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పనిలో సందేహాల్ని సీనియర్లను అడిగి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ యుగంధర్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నగరంలో వేగంగా అభివృద్ధి పనులు

మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 12వ డివిజన్‌లో శుక్రవారం లాలాపేట పాత పోలీస్ స్టేషన్ రోడ్డులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతాక్రమంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రహదారుల విస్తరణ పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని, అంతేకాక నగరాభివృద్ధికి కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలియజేశారు. నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధుల్ని కలుపుకొని వెళ్తామని, వారి అభిప్రాయాల మేరకు పనుల్ని చేపడతున్నట్లు మేయర్ వివరించారు. కాంట్రాక్టర్లు కూడా టెండర్ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పనుల్ని పూర్తి చేయాలని సూచించారు. అధికారులు కూడా వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి, వైఎస్సార్ సీపీ 20వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఖాజా మొహిద్దీన్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ కన్యకా పరమేశ్వరికి 58 కేజీల లడ్డూ సమర్పణ



పాత గుంటూరు: శరన్నవరాత్రుల సందర్భంగా ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మ వారికి బైసాని కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం 58 కేజీల లడ్డూను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా నవరాత్రుల్లో తమ సంస్థ తరఫున ప్రసాదాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, ఆలయ మాజీ సభ్యురాలు బైసాని ఇందుమతి, కిరణ్, భావన, కాశిక్, కృష్ణ, మూర్తి పాల్గొన్నారు.

పుస్తక పఠనం లేక యువత నిర్వీర్యం

ఒంగోలు నుంచి విజయవాడకు 'మరో గ్రంథాలయ ఉద్యమం' పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయోద్యమంలో సమాజాన్ని, దేశాన్ని చైతన్య పర్చిన గ్రంథాలయోద్యమం ప్రస్తుతం పర్యవేక్షణ, ఆదరణ లేక సమాజం చైతన్యరహితంగా తయారవుతోందని ప్రముఖ కథా రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమం ఒంగోలు నుంచి విజయవాడకు పాదయాత్రగా బయలుదేరి శుక్రవారం గుంటూరుకు చేరిన సందర్భంగా జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంచికంటి మాట్లాడుతూ యువత, విద్యార్థులు సరైన పుస్తక పఠనం లేక సెల్‌ఫోన్ మోజులో నిర్వీర్యం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న విషయాలకు భావోద్వేగాలు అదుపులో ఉంచుకోక పెడదారిన పడుతున్నారని తెలిపారు. ఈ సమయంలో ప్రతి పాఠశాల, కళాశాల, ఊరు, వాడల్లో గ్రంథాలయాలు స్థాపించి యువతను పుస్తక పఠనం వైపు మళ్లించాలని ఆయన పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ రచయిత మంచికంటి పాదయాత్ర అభినందనీయమని తెలిపారు. రచయిత్రి రుక్మిణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజుకు ఒక పీరియడ్ తప్పక గ్రంథాలయంలో పఠనం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశ అనంతరం ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయాన్ని సందర్శించిన అనంతరం పాదయాత్ర విజయవాడకు బయలు దేరింది. సమావేశంలో విరసం ప్రతినిధి సీఎస్సార్ ప్రసాద్, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఓపీడీఆర్ భాస్కరరావు పాల్గొన్నారు.



సంపత్ నగర్ శ్రీ శారద ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణ



గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..



ఏటీ అగ్రహారం గాయత్రీ మందిరంలో సరస్వతీదేవిగా..



బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

చదువుల తల్లి సరస్వతీ నమోస్తుతే !

నగరంలో శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు శుక్రవారం చదువుల తల్లి, జ్ఞాన ప్రదాయని శ్రీ సరస్వతీ దేవి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ, ఉత్సవ కమిటీలు పర్యవేక్షించాయి. – పాత గుంటూరు



అరండల్‌పేట శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో..



మల్లారెడ్డినగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో..



విద్యానగర్ శ్రీ సాయినాథ సన్నిధానంలో..



మల్లికార్జునపేట శివాలయంలో..



ఆర్. అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ..



విద్యానగర్ శ్రీ సాయినాథ సన్నిధానంలో జరిగిన సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు



నవదుర్గల వేషధారణల్లో హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థినులు

జీజీహెచ్‌లో సత్యసాయి సమాచార సహాయ కేంద్రం



సమాచార సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్య సాయి ఉచిత సమాచార సహాయ కేంద్రాన్ని శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు సేవ చేసేందుకు సత్య సాయి సేవా సమితి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. సత్య సాయి సమితి సభ్యులకు నర్సింగ్ సిబ్బంది సహకారాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ ఏ.రామకృష్ణ రావు, కె.సాయిబాబు, డాక్టర్ పి.ఎల్.నరసింహమూర్తి, వై.రోశరావు, శ్రీధర్, ఎస్.వి.హనుమంతరావు, శిరీష, అపర్ణ, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమావేశం

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే ? అనే విషయంపై నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట నుంచి చిలకలూరిపేటకు వెళ్లే దారిలో మిర్చి యార్డు సమీపంలోగల హోటల్ అట్లాస్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొంటారని ఆమె తెలియజేశారు.